క్లుప్తంగా

వైఎస్సార్ వర్ధంతి రేపు

కొయ్యూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నల్లగొండలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు ఆదివారం తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా కమిటీల నేతలు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా నల్లగొండలో దివంగత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని చెప్పారు. పార్టీ నేతలు అంతా కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

వేంకటేశ్వర కల్యాణం వాయిదా

అడ్డతీగల: అడ్డతీగలలో ఈనెల 8న పవనగిరి క్షేత్రం ఆధ్వర్యంలో టీటీడీ వారి ద్వారా నిర్వహించతలపెట్టిన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. రానున్న డిసెంబర్ నెలలో కల్యాణ మహోత్సవం జరిపే అవకాశం ఉందన్నారు. అధికారికంగా టీటీడీ నుంచి కల్యాణం నిర్వహించే తేదీ నిర్ణయించిన అనంతరం తెలియజేస్తామన్నారు.

పోలీసుల కౌన్సెలింగ్



గంజాయి కేసుల్లో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: గంజాయి సాగు ,రవాణా, మధ్యవర్తిత్వం చట్టరీత్యానేరమని ఇటువంటి వాటికి అందరూ దూరంగా ఉండాలని ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. మండల కేంద్రంలో గల సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గంజాయి కేసుల్లో పాత నేరస్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు జోలికిపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. గ్రామాలు ప్రశాంతగా ఉంచాలని ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేయఆయన హెచ్చరించారు.

ఘనంగా సత్యసాయి శతనామ సంకీర్తన



సంకీర్తనను నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : సత్యసాయిబాబా శతనామ సంకీర్తనా కార్యక్రమాన్ని కె.కోటపాడు రామాలయంలో కె.కోటపాడు సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 100 మంది బాలలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలలకు సత్యసాయి సేవా సంస్థల తరఫున బహుతులు అందజేశారు. బాల వికాస్ గురువులు బండారు రామలక్ష్మి, జేగురపాటి జ్యోత్స్న, సాయి శంకర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, పుష్పాలు, బంగారు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాలు, తాగు నీటిని భక్తులకు అందజేసింది.

దారుణ దారులు

- కోతకు గురైన కల్వర్టులు, రహదారులు
- గోతుల దారుల్లో పెరుగుతున్న ప్రమాదాలు
- చినుకు పడితే చిత్తడే
- వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కొట్టుకుపోయిన కోడిపుంజువలస- వర్రా కాజ్‌వే



కామయ్యపేట రోడ్డు దుస్థితి



గన్నెల రైలు అండర్ బ్రిడ్జి సమీపంలో అధ్వానంగా కల్వర్టు



యండపల్లివలస వద్ద ప్రమాదకరంగా మారిన వంతెన



రణజిల్లెడ- హట్టగుడ రింగ్‌రోడ్డులో శిథిలమైన కల్వర్టు

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో రహదారులు, కల్వర్టులు, వంతెనలు అధ్వానంగా మారాయి. పలు గ్రామాల్లోని కల్వర్టులు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధ్వాన రహదారులపై ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారు.గోతుల రహదారుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి లోగా రహదారులు బాగు చేస్తామని, కొత్తవి నిర్మిస్తామని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అమలుచేయలేదని పలువురు చెబుతున్నారు. కొన్ని చోట్ల అక్కడక్కడ చేసిన ప్యాచ్ వర్కులు కూడా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయంటున్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి, రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అరకులోయ- పాడేరు రహదారిలోని యండపల్లివలస సమీపంలోని బురద గెడ్డ వంతెన వద్ద బ్రిడ్జి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా వంతెన వద్ద కోతకు గురై ప్రదేశాన్ని బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గోతులమయం

- ప్రముఖ సందర్శిత ప్రాంతమైన రణజిల్లెడ-హట్టగుడ రహదారిలో కల్వర్టు కోతకు గురైంది. ఈ రహదారి మీదుగా ప్రతీ రోజులు స్థానిక ప్రజలతో పాటు పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు కల్వర్టు బాగు చేయాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.
- విశాఖ- అరకు రహదారిలోని గన్నెల జంక్షన్ నుంచి గన్నెల గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్ల రహదారి శిథిలదశకు చేరింది. ఈ రహదారి మీదుగా సుంకరమెట్ట వారపు సంతకు లోతేరు, ఇరగాయి, గన్నెల, బొండాం, మాదల, పెదలబుడు, కొత్త భల్లుగుడ పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధ్వాన రహదారితో స్థానిక రైతులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను సంతలకు తీసుకెళ్లి విక్రయించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు అండర్ బ్రిడ్జి సమీపంలోని వంతెన ఇటీవల కొట్టుకుపోయింది. తూతూ మంత్రంగా పైపులు వేసి గ్రావెల్, క్రషర్ డస్ట్ వేసి విడిచి పెట్టారు. వర్షం పడితే ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయమని స్థానికులు చెబుతున్నారు.
- సుంకరమెట్ట నుంచి జనంగుడ, మాడగడ, చొంపి, శిరగాం పంచాయతీ మీదుగా డుంబ్రిగుడ మీదుగా పెదపాడు గ్రామాల మీదుగా నిర్మించిన రహదారి శిథిలమై రాళ్లు తేలి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ముఖ్యంగా ఎం.హట్టగుడ-మాడగడ మధ్యలో రహదారి గోతిలో బురద చేరి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది. వాహనచోదకులతో పాటు ఆటోల ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆయా రహదారులు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హుకుంపేట: మండలంలోని కామయ్యపేట ,ఉప్ప ప్రాంతాల రోడ్లు గోతులమయంగా మారాయి. మట్టుజోరు నుంచి తీగలవలస వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రా-ఒడిశా ప్రాంతానికి సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. రహదారి అధ్వానంగా మారడంతో నానా అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొట్నాపల్లి నుంచి ఉప్ప వరకు రోడ్డు గోతులమయంగా మారడంతో సంతారి, రాప, ఒల్డా, మత్స్యపురం పంచాయతీలకు వెళ్లేందుకు స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రం నుంచి అమ్మిరేఖల, అప్పలరాజుపేట, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి వెళ్లే రహదారి గోతులమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సుమారు 9 కిలోమీటర్ల నిడివిగల ఈ రహదారి ఐదు లోతట్టు గ్రామాల ఆదివాసీలు రహదారి రవాణా అవసరాలను తీరుస్తోంది. ఈ రహదారి దాదాపు మూడు కిలోమీటర్లకు పైబడి దెబ్బతిందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుందని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్, 108 వాహన సేవలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు



రోడ్డు గోతులు ఏర్పడి అధ్వానంగా మారడంతో అత్యవసత పరిస్థితుల్లో ఇబ్బందిగా ఉంది. గోతులు రహదారుల్లో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకు కురిసినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించాలి.

– కిల్లో ఆనంద్, వైస్ సర్పంచ్, తీగలవలస పంచాయతీ, హుకుంపేట మండలం

వెతలు తీరేనా!

- సీలేరులో పశువైద్యశాలకు నిత్యం తాళాలు
- అందని సేవలు... ఆందోళనలో పాడిరైతులు



గోతిలో పడి కాలు విరిగిన ఆవు



తాళం వేసి ఉన్న సీలేరు పశువుల ఆస్పత్రి

సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో పశు వైద్యం అటకెక్కింది. సీలేరులో పశు వైద్యశాల ఉన్నా సిబ్బంది అందుబాటులో లేక పశువులకు వైద్యం అందడం లేదని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. ఆస్పత్రి ద్వారా సమయానికి వైద్యం అందక పశువులు అనారోగ్యంతో మృతి చెందుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల పశు వైద్య శాఖలో బదిలీల్లో భాగంగా స్థానికంగా పశు వైద్యాధికారిని నియమించారు. ఆయనకు పీజీ సీట్ రావడంతో వెళ్లిపోయారు. ఆయన స్థానంలో గూడెం పశువైద్యాధికారి ఇన్‌చార్జిగా నియమించారు. అయితే జూనియర్ వెటర్నరీ డాక్టర్ ప్రస్తుతం మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ప్రస్తుతం పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఇతరులు సక్రమంగా హాజరుకావడం లేదని, తరచూ ఆస్పత్రికి తాళాలు వేసి ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేక పశువులకు నాటువైద్యం చేస్తున్నామని పలువురు చెబుతున్నారు. అల్లూరి వీధిలో రెండు రోజుల కిందట ఆవు కాలువలో పడి కాలు విరిగిపోవడంతో స్థానిక పశువైద్యశాలకు వెళ్లగా సిబ్బంది లేక ఇబ్బందులు పడ్డానని పశు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పశు వైద్యాధికారి ఎల్.రమేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు తనకు ఈ విషయం తెలియదన్నారు. సీలేరులో పశువైద్యశాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గణపతి విగ్రహానికి గరికిగడ్డితో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు,అర్చకుడు రామం , ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ప్రతినిధులు ముకుంద రావు, రామారావు, రాజుబాబు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. పాడేరు పట్టణంలోని పాతబస్టాండ్, చాకలిపేట తదితర ప్రాంతాల్లోని గణపతి విగ్రహాలను పాడేరు పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. చిలకలమామిడి గెడ్డలో నిమజ్జనం చేశారు.



రాజవొమ్మంగిలో వినాయక నిమజ్జన ఊరేగింపులో స్థానికుల సందడి



పాడేరులో గణనాథుని నిమజ్జనంలో చిన్నారులు

కొయ్యూరు: రాజేంద్రపాలెం, కొయ్యూరు, సింగవరం తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా వినాయక విగ్రహ నిమజ్జనాలు జరిగాయి. సమీపంలోని కాలువలలో నిమజ్జనం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోలీసులు భద్రత కల్పించారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా జరిగాయి. గణనాథుని విగ్రహాల ఊరేగింపులో యువత థింసా నృత్యాలతో సందడి చేశారు. అనంతరం విగ్రహాలను ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు గణనాథుల విగ్రహాల ఊరేగింపు హడావుడి నెలకొంది.



రాజేంద్రపాలెంలోని ఊరేగింపులో భక్తులు



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు,భక్తులు

ఉధృతంగా వాగులు

- అప్రమత్తమైన యంత్రాంగం



ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారుల పహారా

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి వరద చేరడంతో పోర్లు ద్వారా దిగువకు ప్రవాహం పెరిగింది. దీనికి తోడు కబర్మతి, పులిగుమ్మి వాగుల ఉధృతితో రాజవొమ్మంగి వట్టిగెడ్డ కొండవాగు ప్రమాదస్థాయిలో పొంగి ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి వయ్యేడు, బూరుగపల్లి, ముర్లవానిపాలెం, శాంతినగర్, శ్రీరాం నగర్‌కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొలాల నుంచి రైతులు గ్రామాలకు తిరిగి ఇళ్లకు చేరేందుకు వాగు వద్దనే రాత్రి 9 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విషయం తెలిసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు వాగువద్దకు వచ్చి ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని జాగ్రత్తలు చెబుతున్నారు. కాగా ఈ వాగుపై వంతెన నిర్మించాలని అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలని వినతి



తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వి.ఆర్.పురం: వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు చెప్పారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఆదివారం తహసీల్దార్ సరస్వతిని కలిశారు. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసరాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరదలు సంభవించి అయిదు రోజులవుతున్నా బాధితులకు ఇప్పటివరకు నిత్యావసర సరకులు అందడం లేదని, జలదిగ్బంధంలో చిక్కొని ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీ, శ్రీరామగిరి, చింతరేగిపల్లి, గుండుగూడెం, పత్తిపాక, రామవరం, చొక్కనపల్లి, కొత్తూరు, ఇప్పూరు సీతంపేట, కన్నాయిగూడెం, తుష్టివారిగూడెం తదితర గ్రామాలు ఇప్పటికీ ముంపులో ఉన్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వరద బాధితులకు తక్షణ సాయం అందిందని, సాయం రూ.2వేలు అందజేశారని గుర్తు చేశారు. వరద బాధితులను తక్షణమే కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఎస్సీ సెల్ ప్రతినిధి మాచర్ల గంగులు, ఆర్టీఐ జిల్లా విభాగ అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు చిక్కాల బాలు , రాజుపేట ఉప సర్పంచ్ ముంజవు రాము, నాయకులు వి.రాజారావు. ఎం.నరేష్ , సీహెచ్.కాంతారావు, జె.నాగేశ్వరరావు, కె.సత్యనారయణ, జి.రామకృష్ణ, జి.ఫణీంద్ర, ఎం.శ్రీరామ్, సుధాకర్, ఎం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం గ్రామస్తుల ఆందోళన



దేగలరాయి గ్రామం వద్ద రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

జి.మాడుగుల: మండలంలో సొలబం పంచాయతీ దేగలరాయి గ్రామానికి సమీపంలో ఆదివాసీ గిరిజనుల(పీవీటీజీ)నివాస వీధికి సరైన రోడ్డు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగా స్థానికులు ఆదివారం శ్రమదానంతో గ్రామంలోని వీధికి చేరేందుకు మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించి కాలిబాటను నిర్మించుకున్నారు. అనంతరం గ్రామ శివారు వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఆదివాసీ వీధిలో 70 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, కనీసం రోడ్డు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామం నుంచి గర్భిణులు, రోగులను ఆస్పత్రికి తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మించాలని వారు కోరారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు





రాజేంద్రపాలెం, చింతపల్లిలోని అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కొయ్యూరు: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అనేకచోట్ల అన్నసమరాధన ఏర్పాటు చేశారు. మండలంలోని రాజేంద్రపాలెంలో వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పీటా సింహాచలంలు అన్నసమరాధనలో పాల్గొన్నారు. కొయ్యూరులో సర్పంచ్ మాకాడ బాలరాజు ,ఇతర నేతలు పాల్గొన్నారు. బూదరాళ్ల, సింగవరంర ఐటీడీఏ కాలనీ, చింతలపూడితో పాటు అనేక చోట్ల అన్నసమరాధన ఏర్పాటు చేశారు.భక్తులు దీనిలో బారీగా పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని పలు మండపాల వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, రమేష్, శేషు, నూకరాజు,నగేష్ తదితరులు చెప్పారు.

లడ్డూ వేలంపాట రూ.47,216



అంజలిశనివారం గ్రామంలో వినాయక లడ్డూ ఊరేగింపులో భక్తులు

అంజలి శనివారం పంచాయతీ కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కిముడు కోటేశ్వరరావు, ఈశ్వరమ్మ దంపతులు రూ.47,216లకు లడ్డూను దక్కించుకున్నారు. ఆ లడ్డూతో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామంలో ఊరేగించారు. మండల వైస్ ఎంపీపీ వెంగళరావు, మాజీ సర్పంచ్ బెన్నలింగం నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



హాజరైన గిరిజనులు

గిరిజన సంఘాల డిమాండ్

రంపచోడవరం: రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా రంపచోడవరంలో ఆదివారం గిరిజన సంఘం నాయకులు సమావేశమై ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై తీర్మానాలు చేశారు. పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీల నుంచి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంపచోడవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో ఇక్కడ గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం గంగాదేవి, సర్పంచ్ వేట్ల విజయ, గిరిజన చైతన్య వేదిక కన్వీనర్ వెదుళ్ల లచ్చిరెడ్డి, జిల్లా సాధన సమితి కన్వీనర్ బాలు అక్కిస, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, నాయకులు పండా రామకృష్ణదొర, జోగారావు, గొర్లె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో కోతకు గురైన ప్రాంతం

జి.మాడుగుల: చింతపల్లికి వెళ్లే మార్గంలో గల కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ఘాట్‌రోడ్డు మార్గంలో రక్షణగోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొయ్యూరు, జీకె వీధి, చింతపల్లి మండలాల ప్రజలు పాడేరు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే ఇది ప్రధాన రహదారి. ఈ రోడ్డు మార్గంలో కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డు రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని ఈ మార్గం మీదుగా రోజూ అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కారు, బైక్ ఢీ

నర్సీపట్నం:నర్సీపట్నం నుంచి తుని వెళ్లే మార్గంలో బయపురెడ్డి పాలెం వంతెనపై కారు, బైక్ ఢీ కొన్నాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదం కారణంగా నర్సీపట్నం- తుని మధ్య ఇరువైపులా రాకపోకలు సాగించే వాహనాలు వంతెనపై నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు సుమారు 40 నిమిషాలు సమయం పట్టింది.